22

# పూవులు - కాయలు

'ఏమండోయి చూశారా...పొట్ల తీగెకి మొగ్గ వస్తోంది' అంది జానకి.

"పొద్దున చూస్తే లేదుగా జానకీ...ఎదీ లాంతరు తీసుకురా...' అంటూ రాఘవయ్య ఇంట్లోకి వస్తూనే ఆదుర్దాగా దొడ్లోకి వెళ్ళాడు. జానకి లాంతరు తెచ్చి పాదు దగ్గరగా పెట్టి 'వేలుపెట్టి చూపించేరు జాగ్రత్త...వేలు గుప్పిటలోంచి రావాలి....' అంది.

రాఘవయ్య లాంతరు తీసుకుని పాదు చుట్టూ తిరిగి పక్కసారి కళ్లు మూసుకుని 'పద జానకి...కనపడింది తొందరగా పద అంతసేపు గుడ్లప్పగించి చూస్తావెందుకు ' అంటూ జానకి బుజంమీద చెయ్యి వేసి ఇంట్లోకి మెల్లగా వచ్చాడు.

'చూశావామరి...దిష్టిబొమ్మ. దిష్టిబొమ్మ అని పెద్ద ఆర్భాటం చేశేవు...అంతా ఏమిటా అని చూడటానికి వస్తారు...వట్టి సున్నపు నీళ్లు చల్లితేసరి...ఏమంటావు...'అన్నాడు సంప్రదింపుగా. జానకి నవ్వుతూ 'అంత లేత మొక్క...సున్నపు నీళ్లు చల్లితేఘాటు గదండీ... మీది మరీ చోద్యం' అంది.

జానకి ఆ రాత్రి ఎంతో తృప్తిగా, నిశ్చింతంగా నిద్రపోయింది. రాఘవయ్య రోజూ కలవరించేవాడు, ఆ రోజు కలత నిద్రగా గూడా అనిపించలేదు.

తెల్లవారుతుండగా ఎవరో కాళ్లు తాకినట్లు అనిపిస్తే ఉలిక్కిపడి లేచాడు. జానకి అతని పాదాలకు నమస్కరిస్తోంది. మనస్సులోనే ఆమెను ఆశీర్వదించి మళ్లీ దుప్పటి పైకి లాక్కుని పడుకున్నాడు.

జానకి మనస్సుకు ఎంతో వేదనగా ఉంది. మాటిమాటికీ పొట్ల పాదు దగ్గరకుపోయి కొత్తగా తొడుక్కుంటున్న మొగ్గను చూద్దామని ఆరాటం. అన్నిసార్లు అదే పనిగా చూడగూడదని, ఆరాత్రే రాఘవయ్య అన్నమాట ఆమె మనస్సులో మెదులుతునేవున్నది. అయినప్పటికీ

ఏదో పని వంక పెట్టుకుని పాదు దగ్గరకుపోయి సూటిగా చూడకుండా ఓరగా ఆ మొగ్గవంక చూస్తూ వచ్చింది.

రాఘవయ్యకు బాగా మెలకువ రాగానే ఒకసారి కళ్ళుతుడుచుకుని గబగబా మంచందిగి పాదు దగ్గరకు పోయి ఎవరూ తన్ను చూడలేదన్న సంతృప్తితో ఇంట్లోకి అదే వేగంలో తిరిగివచ్చాడు. జానకి చూసినా ఎరగనట్లు మాట్లాడుతూ వచ్చింది.

ఆ రోజునుంచి రాఘవయ్య బజారు పని ముగించుకొని సాయంత్రం ఇంటికి రాగానే ఆ మొగ్గ ఎలా పెరుగుతూవచ్చిందీ దాని తర్వాత తీగెమీద ఎన్ని మొగ్గలు మొలిచిందీ అన్నీ వివరంగా చెపుతూ వచ్చింది జానకి. ఒక తీగె పట్టుకోసం పక్కనేవున్న గోడను ఆధారం చేసుకుని పాకుతోంది. అక్కడ చిన్న మేకులుకొట్టి గోడమీద పురికోసతోజాలు అల్లింది. ఆ సంగతి రాఘవయ్యకు చెప్పింది. అలా కాదని ఆ రోజు రాత్రిపూటనే ఇంట్లో పాత వాసం వుంటే బద్దలుచీల్చి ఆ పాదుకు నాలుగు పక్కలా పాతినవారు ముక్కలతోనూ, నులకతాళ్లతోనూ పందిరి అల్లాడు.

గోడమీదకు పాకుతున్న తీగెను పందిర మీదకు మరలించటం చాలా కష్టమయింది. గోడ ఇటికల మధ్య మన్నులో తీగె చొచ్చుకుపోయింది. రాఘవయ్య బలవంతానా తీగెను లాగేసి పందిరకు తగిలిస్తే అదే అల్లుకుంటుందన్నాడు. మెల్లిగా వీలయితేనే తీయమంది జానకి. తీగెను పందిరమీదకు అల్లించ వలసిన ఆవశ్యకతను గూర్చి నచ్చ చెప్పాడు. ససేమిరా వీల్లేదంది జానకి. ఆ లేతతీగ తెగిపోతే తను చూడలేనంది. ఇంట్లోకిపోయి వల వలా ఏడ్చి కళ్లు ఎర్రచేసుకుంది. రాఘవయ్య పనిపూర్తిచేసుకుని ఇంట్లోకి వచ్చి జానకి ముఖం కందడం చూసి 'తప్పుకాదూ!' అన్నాడు. 'ఊఁ...' అంది జానకి.

రాఘవయ్య నిద్రపోయాక జానకి లాంతరు లేకుండా పొట్లపాదు దగ్గరకుపోయి పందిరవైపుకు పోతున్న తీగెను చూసింది. ఆమెకు దుఃఖం పొర్లుకు వచ్చింది. గోడమీదకు వచ్చినతీగె కనిపించలేదు.

బహుశా విరిగిపోయి వుంటుంది. లాంతరు వుంటేనే కాని కనపడదు. తనందుకునే వచ్చేటప్పుడు లాంతరు తెచ్చుకోలేదు.

ఆ పువ్వు పూసింది. జానకి ఆనాడు ఇంట్లో పరమాణ్ణం చేసింది. బజ్జీలు వండింది. ఇరుగు పొరుగువారిని భోజనానికి పిలిచింది. ఏమిటని అడిగిన వారికి 'తన పుట్టినరోజ'ని చెప్పింది. ఇంత వయసు వచ్చి పుట్టిన రోజు పండగేమిటని కొందరు తికమకపడ్డారు. పుట్టిన రోజంటే ఏమిటో వారికి అర్థంకాదు అనుకుంది జానకి.

రాఘవయ్య ఆ రోజుకు పని మానుకున్నాడు. పగలల్లా గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నట్లు కాగితాలు ముందర వేసుకుని చువ్వల మధ్యనించి పొట్లపాదు మధ్యలో వికసించిన ఆ పువ్వు వంకనే చూస్తున్నాడు. తెల్లటి తెలుపు ఆ సువాసన నాసికాగ్రాన్ని చేరుకోలేకపోయినా అతన్ని మత్తెక్కించి వేస్తోంది. జానకి ఆరుబయట వరండాలో రాట్నం వడుకుతూ కూర్చుని మధ్య మధ్య పొట్లపాదువంక దృష్టిని ప్రసరింపజేస్తోంది.

"ఏమండీ...ఏదో వ్రాసుకుంటున్నట్లున్నారు"

"అబ్బే...ఏంలేదు. అయినా జానకీ ఇవ్వాళ మంగళవారం కదూ, రాట్నం వడుకుతున్నావేం"

"ఏం...ఎందుకని వడకకూడదు?"

జానకి, రాఘవయ్యలు ఏమి మాట్లాడుకోవాలో తెలియలేదు. వారు భరించలేనంత ఆనందం వారి హృదయంలో తిష్టవేసి వారిని విహ్వలత పొందిస్తున్నది.' 'ఆ పువ్వుకి ఎన్ని రేకలున్నాయో చూశారా. ఆరుగదూ...అన్నింటికీ అంతే వుంటాయి గదండీ...'

'అది సరేగానీ...చెట్టు మొదట్లో ఆకులు వాడిపోతున్నాయేమిటో చూశావా'

'అవునండీ...శాస్త్రం ఇంత పెరిగింది కదా...దానికేం మందులుండవుటండీ'

ఇద్దరూ కల్పించుకున్న పనులను మానేసి పాదు దగ్గరకు చేరారు. ఎంతో ఆసక్తితో పువ్వువంక చూశారు. రేకలు ముకుళించుకుని లోపలకు కొద్దిగా వంగినాయి.

'మధ్యాహ్నం చూశారా...వక్కడే తేనెటీగ ఎన్నిసార్లు వచ్చిందనుకున్నారు. మరీ మొరటుతనం...అప్పుడే పువ్వు నలిగిపోయింది అంది జానకి.

'సరేగాని జానకి...ఎన్ని గబ్బుచీమలు పట్టినాయో చూశావా!' అంటూ పువ్వుమీద మెల్లగా ఊదడం ప్రారంభించాడు.

'ఊరుకోండి మరీను...పువ్వు ఎలా వూగుతోందో....అట్లాగే గట్టిగావూదితే ఇదికాస్తా రాలిపోతుంది' అంది జానకి. రాఘవయ్య ఆమెవంక తీవ్రంగా చూశాడు. జానకి కొద్దిగా జంకి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆరోజు సాయంత్రం ఎవ్వరూ పాదు దగ్గరకు పోరాదని ఒక శపథంచేసుకున్నారు. రాఘవయ్య బజారులో పిచ్చి వాడిలా ఎక్కడెక్కడో తిరిగివచ్చాడు. జానకి వంటింటిలోనుంచి బయటకు రానేలేదు.

'ఇవ్వాళ పొద్దున చూద్దామా' అని అడిగింది జానకి మంచంమీదికి వస్తూ. 'అట్లాగే!' అన్నాడు రాఘవయ్య.

తెల్లవారుజామున నాలుగింటికే లేచిన రాఘవయ్య జానకి మంచం మీద లేకపోవటం చూచి ఆశ్చర్యపోయాడు. ధబుక్కున లేచి చూచాడు. జానకి పాదు దగ్గర లాంతరుపెట్టుకుని కూర్చుంది. ఒక క్షణం ఆగి తనూ పాదు దగ్గరకు పోయాడు. జానకి విస్తుపోలేదు.

"పువ్వు రాలిపోయింది చూచారా" అంది గద్గదమైన స్వరంతో. అతను తలవంచుకుని 'నేను చూసేదేముంది' అంటూ వచ్చినవాడు వచ్చినట్లుగా మంచంమీదకుపోయి పడుకున్నాడు. జానకి కూడా వచ్చేసి 'నాకెందుకనో భయంగా వుందండి' అంది.

'ఎందుకు భయం....పిచ్చిదానా....' అన్నాడు. జానకి అతనిమీదకు ఒరిగిపోయి 'పిచ్చిదాన్ని అయిపోయినా బాగుండేది....' అంటూ పసిపిల్లలా ఏడ్చింది.

వారు పాదుకి పూలు పూయటం అప్పటినుంచి తరుచుగా చూస్తు న్నారు. ఎన్నో పూలు పూస్తున్నాయి. ఒక్కటీ నిలవటంలేదు. మరు నాటి ఉదయానికల్లా రాలిపోతున్నాయి. జానకి వాటన్నిటినీ ఏరి వక సీసాలో పోస్తోంది. రాఘవయ్య ఎన్ని రకాలమందులో తెచ్చి వాడు తున్నాడు. ఒక్క పిందె పువ్వూ పడలేదు. పాదు పందిర అంతా అల్లుకు పోయి మల్లె పందిరెలా విరగపూస్తోంది. జానకి ఆ పాదు మొదట్లో కూర్చుని విలపిస్తూ 'నేను పాపిష్టిదాన్నయతే కావచ్చు కాని....నాచేతులేం పాపంచేసినాయి భగవాన్. ఈ పాదుకు వక్క కాయ కాయరాదూ....!' అంటూ ప్రశ్నించేది. రాఘవయ్య ఇంట్లోనే కూర్చుని 'నేను చేసుకున్న పాపానికి శిక్ష జానకి గూడా ఎందుకు అనుభవించాలి....!' అని గొణు గుతూ వుండేవాడు.

ఒకరోజు రాఘవయ్య బాగా పొద్దు క్రుంకిన తర్వాత ఇంటికి వచ్చాడు. అతను రావటం చూసి జానకి పరుగెత్తుకుంటూవచ్చి 'ఒక మాట...' అంది.

'నీ మాటలకేంగాని....నేనొక శుభవార్త చెబుదామనుకుంటు న్నాను....' అన్నాడు.

'నేను చెప్పబోయేదిగూడా శుభవార్తే!' అంది జానకి.

'అయితే నువ్వే ముందరచెప్పు...'అన్నాడు రాఘవయ్య కొంచెం సర్దుకుని.

'మన పాదుకు వక పిందె పువ్వు పడింది.'

'ఆ...నిజంగా...లాంతరు తీసుకురా ... ఎక్కడా...ఏ తీగెకి ఉత్తరంవైపునా ... దక్షిణం వైపునా...' అంటూ గబగబ లాడిస్తూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

జానకి లాంతరు తెస్తూ "మీరు చెప్పబోయే శుభవార్త యేమిటి" అంది.

'అబ్బే...ఏంలేదు, తమాషాకన్నాను'

'కాదు, నిజం చెప్పండి'

'మనం పెంచుకొనడానికి దశరథ రామయ్య తన కొడుకునిస్తానని చెప్పాడు అదీ...' అన్నాడు.

జానకి లాంతరుకింద పెట్టి అతనికి దగ్గరగా వచ్చింది. ఆమెను హృదయానికి దగ్గరగా తీసుకుని 'రామయ్యగారితో ఏమని చెప్పను' అని అడిగాడు—

'మా దొడ్లో పాదుకు పిందెమొగ్గ వేసిందని చెప్పండి....' అంది జానకి—

★